# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 335 | పేజీలు: 4 | వెల: 4/- | బుధవారం ● 19, జూన్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## శంషాబాద్ విమానాశ్రయానికి
# బాంబు బెదిరింపు

### తనిఖీలు చేపట్టిన భద్రతా సిబ్బంది

**హైదరాబాద్,జూన్18(నమస్తే ఉదయం):** శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. గుర్తుతెలియని అగంతకుడు ఎయిర్ పోర్ట్ మెయిల్‌కు బాంబు ఉందని లేఖ పంపాడు. అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఎయిర్ పోర్ట్ అధికారి ఒకరు మాట్లాడుతూ.. 'శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు వచ్చింది. ఇంటెలిజెన్స్ అధికారులకు ఓ అగంతకుడు బాంబు పెట్టామంటూ మెయిల్ చేశాడు. అది చూసిన అధికారులు భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశారు. క్షుణ్ణంగా తనిఖీలు చేసిన సిబ్బంది అది ఆగతాయి పనిగా తేల్చారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టాం' అని తెలిపారు.




## ఐటిఐలలో
# ఇక ఆధునిక శిక్షణ

### ఐటిఐలను ఐటిసిలుగా మార్పు
### టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో పదేళ్లకు ఒప్పందం
### విద్యార్థుల్లో ఆధునిక నైపుణ్యాలను కల్పించే లక్ష్యం
### సిఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ
### మల్లేపల్లి ఐటిఐ అధునీకరణ కేంద్రానికి శంకుస్థాపన




**హైదరాబాద్,జూన్18(నమస్తే ఉదయం):** ప్రస్తుతం ఐటీఐల్లో విద్యార్థులకు నేర్పించే నైపుణ్యాలు ఉపయోగం లేకుండా పోయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. 50 ఏళ్ల నాటి నైపుణ్యాలను ఐటీఐల్లో నేర్పిస్తున్నారని, అప్ గ్రేడ్ కావాల్సిన అవసరం ఉందన్నారు. ఐటీఐలను ఐటీసీలుగా మారుస్తున్నామని ప్రకటించారు. ఇందుకోసం టాటా సంస్థ సహకారం తీసుకుంటున్నామని వెల్లడించారు. విద్యార్థులు, నిరుద్యోగులను నా కుటుంబ సభ్యులుగా భావిస్తున్నానని వివరించారు. తన ఆలోచనల నుంచి వచ్చిందే ఏటీసీ సెంటర్స్ అని పేర్కొన్నారు. మేం పాలకులు, మీరు బానిసలు అనే ఆలోచన లేదు. మేం సేవకులం అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 40 లక్షల మంది యువతీ యువకులు ఉపాధి లేక రిక్రూట్‌మెంట్ బోర్డుల చుట్టూ తిరుగుతున్నారు. సర్టిఫికెట్ ఉంటే సరిపోదు సాంకేతిక నైపుణ్యం ఉండాలి. సాంకేతిక నైపుణ్యం ఉంటే ఉపాధి లభిస్తుందని విశ్వసిస్తానని అన్నారు. సర్టిఫికెట్స్ జీవన ప్రమాణాలు పెంచవు. గల్ఫ్ దేశాలకు వలసలు వెళ్లకుండా ప్రభుత్వం ఉపాధి గ్యారంటీ ఇస్తుంది. టాటా సంస్థ సహకారంతో సాంకేతిక నైపుణ్యాల కోసం రూ.2,324 కోట్లతో 65 ఐటీఐలు ఐటీసీలుగా మారుస్తున్నాం. విద్యార్థుల శిక్షణ కోసం ముందుకు వచ్చిన టాటా యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఐటీ రంగంలో ప్రపంచంలో తెలుగు వారు పోటీ పడుతున్నారు. మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించడమే మా బాధ్యతని అన్నారు. రాష్ట్రంలో గల 65 ఐటీఐలను అధునాతనంగా తీర్చిదిద్దుతాం. నైపుణ్యాలను నేర్పించి నిరుద్యోగులకు భరోసా కల్పిస్తాం. విద్యార్థిని విద్యార్థులు ఐటీఐల్లో చేరాలి. ఈ శాఖ తన వద్ద ఉంటుంది. నేనే స్వయంగా పర్యవేక్షిస్తా. ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తా అని' సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో ఐటీఐ స్కిల్ డెవలప్‌మెంట్ అప్ గ్రేడేషన్ ప్రాజెక్టుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టాటా టెక్నాలజీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా యువతను తీర్చిదిద్దేందుకుగానూ ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చాలని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో పదేళ్లకుగానూ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేస్తారు. ఆధునిక పరిశ్రమలకు అవసరాలకు అనుగుణంగా ఏటీసీల్లో యువతకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ఏటీసీల్లో అధునాతన సామగ్రి, సాంకేతికత ఏర్పాటు చేస్తారు. శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణులను టీటీఎల్ నియమిస్తుంది. ఏటీసీల్లో ఏటా 15,860 మందికి ఆరు రకాల దీర్ఘ కాల (లాంగ్ టర్మ్) కోర్సుల్లో, 31,200 మందికి 23 రకాల స్వల్ప కాలిక కోర్సుల్లో శిక్షణ అందిస్తారు. గత పదేళ్లలో రాష్ట్రంలోని ఐటీఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందారు. ఈ ఏటీసీలతో రానున్న పదేళ్లలో నాలుగు లక్షల మంది శిక్షణ పొందుతారు. మిగతా.. 2లో



కలెక్టర్‌కు సంజీవ్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు



సంజీవ్‌ను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పికి ఫిర్యాదు చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

## భూవివాదంలో హత్య గురైన సంజీవ్ కుమార్ కుటుంబానికి
# ప్రభుత్వం న్యాయం చేయాలి

### హంతకులను కఠినంగా శిక్షించాలి : జిల్లా కలెక్టర్, ఎస్పీని కలిసిన ధర్మ సమాజ పార్టీ నాయకులు

**నారాయణపేట, జూన్18(నమస్తే ఉదయం):** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం చిన్న పొర్ల గ్రామ భూవివాదం లో హత్య గురైన సంజీవ్ కుమార్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ , ఎస్పీని కలిసిన ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ పార్టీ నాయకులు , న్యాయ వాది దశరథ్ కుమార్ మాట్లాడుతూ... హత్య గురైన సంజీవ్ కుమార్ కు భార్య అనిత తో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కుటుంబానికి జీవనోపాధి కష్టంగా మారిందని అందుకనే రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షల నష్టపరిహారం ఆ కుటుంబానికి ప్రకటించి ఆ కుటుంబంలో భార్యకు ఉపాధి కల్పించాలన్నారు. జరిగిన ఘటనపై తక్షణం ఒక కమిటీ వేసి హత్య కు ప్రేరేపించిన అంశాలను క్లుప్తంగా విచారణ జరిపి హంతకుల పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు డేవిడ్, గోపాలకృష్ణ ,వేణు, గువ్వల శివరాజ్, కర్నే బాలరాజ్, మూర్తి పాల్గొన్నారు.



## యాదాద్రిలో
# గిరి ప్రదక్షిణం

### విప్ బీర్ల అయిలయ్య సమక్షంలో భక్తుల ప్రదక్షిణం

**యాదగిరిగుట్ట,జూన్18(నమస్తే ఉదయం):** పంచనారసింహ క్షేత్రంమైన యాదగిరి గుట్టలో మంగళవారం సామూహిక గిరి ప్రదక్షిణం ప్రారంభమైంది. అరుణాచలం, సింహాచలం తరహాలో ఇక్కడ ఇకపై సామూహిక గిరి ప్రదక్షిణను నిర్వహించనున్నారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున చేపట్టిన ఈ సామూహిక గిరిప్రదక్షిణలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో పాటు దాదాపుగా 5 వేల మంది భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. అనంతరం కాలినడకన కొండపైకి చేరుకుని గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మిగతా.. 2లో

Forum for Good Governance

## కెసిఆర్, రేవంత్, బండిలపై
# పెండింగ్ కేసులు

### ఉపసంహరించుకోవాలన్న ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్

**హైదరాబాద్,జూన్18(నమస్తే ఉదయం):** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్ర మంత్రి బండి సంజయ్‌లపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి వినతి వచ్చింది. కేసీఆర్, బండి సంజయ్‌లతో పాటు రేవంత్ రెడ్డిపై సైతం నమోదైన చిన్న చిన్న కేసులను ఉపసంహరించుకోవాలని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ తెలంగాణ సీఎంకు లేఖ రాసింది. వీటిలో 2011 మిలియన్ మార్చ్‌లో బీఆర్ఎస్ అధినేతపై నమోదైన కేసు ఉంది. 2009లో ఆయన చేసిన ఆమరణ నిరాహార దీక్ష సమయంలో కేసీఆర్ పై పోలీసులు నమోదు చేసిన కేసు ఇంకా పెండింగ్ ఉందని లేఖలో ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలోకి ప్రవేశించడంపై ఓ కేసు నమోదైంది. దాంతో పాటు బండి సంజయ్‌పై నమోదైన మొత్తం 42 కేసులు కొట్టివేయాలని రిక్వెస్ట్ చేశారు. పోలీసులు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తున్నారంటూ చేసిన కీలక ఆరోపణలపై రేవంత్ రెడ్డిపై గతంలో కేసు నమోదైంది. దాంతో పాటు కరోనా వ్యాప్తి సమయంలో కోవిడ్ ప్రోటోకాల్ ఉల్లంఘించినందుకు బండి సంజయ్‌తో పాటు, రేవంత్ రెడ్డిపై నమోదైన కేసులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి.

## కెసిఆర్‌పై, బిఆర్ఎస్‌పై
# బురదజల్లే యత్నం

### విచారణల పేరుతో పాలన పక్కదారి
### కెసిఆర్‌ను అరెస్ట్ చేయించే తొందరలో బిజెపి
### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జగదీశ్ రెడ్డి




**హైదరాబాద్,జూన్18(నమస్తే ఉదయం):** గత ప్రభుత్వంపై నిందలు వేయడానికి, మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై బురద జల్లాలన్న స్వార్థ రాజకీయంతో విచారణ కమిషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మాజీ మంత్రి , ఎమ్మెల్యే జి .జగదీష్ రెడ్డి అన్నారు. పాలన పక్కన పెట్టి విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో జగదీష్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ... నాలుగు అంశాల్లో ఎక్కడా చిన్న తప్పు లేదని, ఒక్క రూపాయి కూడా నష్టం జరగలేదని అర్థమైందని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా కమిషన్‌తో మీడియా సమావేశం పెట్టించి గతంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు మాట్లాడిన మాటలు చెప్పించారని అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ తెలివి తక్కువతనం, మూర్ఖత్వంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేయాలని బీజేపీకు తొందరగా ఉన్నట్లుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ వేరు కాదని... సీఎం రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కలిసి పని చేస్తున్నారని ఐదేళ్లుగా చెబుతున్నామని జగదీష్ రెడ్డి పేర్కొన్నారు.ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపే ప్రయత్నం చేశారు. కేసీఆర్ తన లేఖలో అన్ని అంశాలను స్పష్టంగా వివరించారు, ప్రజలకు అన్ని విషయాలు స్పష్టంగా అర్థమయ్యాయి. కమిషన్‌కు ఎలాంటి ముందస్తు అభిప్రాయాలు ఉండరాదు. దురదృష్టవశాత్తూ కమిషన్ తన ఉద్దేశాన్ని ముందే బయట పెట్టింది. వాస్తవానికి జస్టిస్ నరసింహారెడ్డి విచారణకు అంగీకరించి ఉండాల్సింది కాదు. కేసీఆర్ విషయంలో ఏమీ తేల్చలేమని చెప్పి... రాష్ట్ర ప్రభుత్వం మీడియాకు లీకులు ఇచ్చింది. ఛత్తీస్‌ఘడ్ ఒప్పందంతో రూ. 6000 కోట్ల నష్టం కాదు..

## హ్యాట్రిక్ విజయంతో
# మరోమారు ప్రధానిని చేశారు

### మీ ఆశలను వమ్ము చేయకుండా పనిచేస్తా
### గంగామాత దత్తతతీసుకోవడంతో మీలో ఒకడినయ్యా
### వారణాసిలో పర్యటించిన ప్రధాని మోడీ
### పిఎం కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల
### 20వేల కోట్లు విడుదల చేసిన ప్రధాని మోడీ





**వారణాసి,జూన్18(నమస్తే ఉదయం):** గంగా మాత తనను దత్తత తీసుకుందని, అందుకే తాను వారణాసివాసుల్లో ఒకరినయ్యానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కాశీ ప్రజలు తనను ఎంపీగా ఎన్నుకోవడమే కాకుండా వరుసగా మూడోసారి ప్రధానిని చేశారని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం ప్రజాస్వామ్య దేశాల్లో మాత్రమే సాధ్యమన్నారు. 60 ఏళ్ల క్రితం ఇది జరిగిందని, అప్పటి నుంచి ఏ ప్రభుత్వం కూడా ఇప్పుడు సాధించిన హ్యాట్రిక్ సాధించలేదని చెప్పారు. ఎప్పటిలాగే ప్రజల కలలు, ఆంక్షాలను పండిచేందుకు తాను రేయింబవళ్లు పనిచేస్తానని చెప్పారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడోసారి వారణాసి ఎంపీగా మోదీ గెలిచిన తర్వాత తన నియోజకవర్గంలో మంగళవారంనాడు తొలిసారి పర్యటించారు. పీఎం-కిసాన్ పథకం కింద 17వ విడతగా రూ.20,000 కోట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, వికసత్ భారత్‌కు రైతులు, యువత, మహిళా శక్తి, పేదలు నాలుగు కీలక స్తంభాలని, తాను ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతులు, పేదలకు సంబంధించిన అంశంపైనే తొలి నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికలను ప్రధాని ప్రశంసిస్తూ, 60 ఏళ్లలో ఒక ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలో రావడం ఇదే మొదటిసారని చెప్పారు. ఎన్నికల్లో 31 కోట్ల మంది మహిళా ఓటర్లు పాల్గొన్నారు, ప్రపంచం లోనే అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్న రికార్డు ఇదని చెప్పారు. ఈ సంఖ్య దాదాపు అమెరికా జనాభాతో సమానమని అన్నారు. భారత ప్రజాజ్వామ్యం పటిష్టత యావత్ ప్రపంచాన్ని ఆకర్షిస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య పండుగను విజయవంతం చేసిన వారణాసి ప్రజలకు పేరుపేరునా ధన్యవాదాలు చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఆసాధరణ తీర్పునిచ్చారని కొనియాడారు. ప్రపంచంలోనే భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబడేందుకు వ్యవసాయ వ్యవస్థ పాత్ర చాలా కీలకమని మోదీ అన్నారు. సదుద్దేశం, పట్టుదల, రైతుల సంక్షేమానికి పాటుపడటం ద్వారా ఇది సుసాధ్యమని చెప్పారు. గ్లోబల్ మార్కెట్‌ను కూడా దృష్టిలో ఉంచుకోవాలని, వ్యవసాయ ఎగుమతుల్లో ఎదురులేని స్థాయికి చేరుకోవాలని అన్నారు. ప్యాకేజీ ఫుడ్ గ్లోబల్ మార్కెట్‌లో ఇండియాను తిరుగులేని స్థాయికి తీసుకువెళ్లాలని, ప్రపంచంలో ప్రతి డైనింగ్ టేబుల్ వద్దకు మన భారతీయ ఫుడ్ ప్రొడక్ట్‌ను తీసుకువెళ్లాలన్నదే తన కల అని చెప్పారు. రైతులకు వ్యవసాయంలో పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పీఎం-కిసాన్ సమ్మాన్‌నిధి' 17వ విడత నిధులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారణాసిలో మంగళవారం నిర్వహించిన 'పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్' కార్యక్రమంలో విడుదల చేశారు. దీంతో దాదాపు 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2వేలు చొప్పున రూ.20 వేల కోట్లు జమ కానున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో విజయం, ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారణాసిలో మోదీ పర్యటించడం ఇదే తొలిసారి.

## ఛత్తీస్‌ఘడ్ విద్యుత్ ఒప్పందంతో
# 2,600 కోట్ల నష్టం

### విద్యుత్ శాఖ మాజీ అధికారి రఘు వెల్లడి
### జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు పవర్ పాయింట్ ప్రజంటేషన్

**హైదరాబాద్,జూన్18(నమస్తే ఉదయం):** చత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందాల వల్ల 2,600 కోట్ల రూపాయల నష్టం జరిగిందని విద్యుత్ శాఖ మాజీ అధికారి రఘు తెలిపారు. మంగళవారం జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ఎదుట పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినట్టు చెప్పారు. భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ కేంద్రాలపై తమ వద్ద ఉన్న సమచారాన్ని కూడా అందించామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌తో తొలుత వెయ్యి మెగావాట్ల సరఫరాకు ఒప్పందం జరిగితే అది సప్లయ్ కాలేదని, తర్వాత తెలుసుకొని మరో వెయ్యి మెగావాట్లకు ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. తరువాత తెలుసుకొని రద్దు చేసుకోవాలని ప్రయత్నిస్తే కుదరలేదన్నారు. చత్తస్ గఢ్ ఒప్పందం రెగ్యులెటరీ కమిషన్ ఒప్పదం పొందలేదని చెప్పారు. ఇరు రాష్ట్రాల డిస్కంలు మాత్రమే ఎంవోయూ చేసుకున్నాయని చెప్పారు. బీహెచ్ఈఎల్ కాంపిటేటివ్ బిడ్డింగ్ లో 2013-2014 88శాతం ఉంటే తర్వాత జీరోకు పడిపోయిందని చెప్పారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన యాదాద్రి ప్లాంట్ తొమ్మిదేండ్లయినా పూర్తి కాలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై బీహెచ్ఈఎల్ సబ్ క్రిటికల్ టెక్నాలజీని రుద్దిందని చెప్పారు. భద్రాద్రి పవర్ ప్లాంట్ కోసం వాడిన యంత్రాలు సరైనవి కావదని అన్నారు. గోదావరిలో ఫ్లడ్ ఎక్కువైతే పవర్



ఎలాంట్‌పై ప్రభావం పడుతుందని చెప్పారు. సాంకేతిక పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా భద్రాద్రి పవర్ ఎలాంట్ నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. యాదాద్రి పవర్ ఎ-లాంట్ వల్ల రవాణా చార్జీల భారం పడుతుందని చెప్పారు. ఈ విషయాలన్నీ కమిషన్ కు వివరించినట్టు చెప్పారు.






బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన శ్రీకోటిలింగేశ్వరదత్త ఆలయం, కొలువు దీరిన శ్రీకోటిలింగేశ్వరదత్త స్వామి

# నేటి నుండి శ్రీకోటిలింగేశ్వరదత్త ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**కొత్తకోట, జూన్ 18(నమస్తే ఉదయం):**
వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి వద్దగల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వరదత్త ఆలయం బ్రహ్మోత్సవాలు బుధవారం నుండి ప్రారంభం కానున్నాయి.
దేవస్థానము భక్తుల సహాయసహకారాలతో దినదినాభివృద్ధి చెందుతూ పదిహేడు సంవత్సరాలు పూర్తి చేసుకొని సప్తమాదశ పదిహేడవ వార్షిక బ్రహ్మోత్సవాలు 19 తేదీ (బుధవారం) జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి నుండి 22 పౌర్ణమి వరకు జరగనున్నాయాని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు స్వీకరించాలని ఆలయ వేద పండితులు కోరారు. బ్రహ్మోత్సవాలకు రానున్న భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.

**నేటి నుండి ఆలయంలో కొనసాగనున్న కార్యక్రమాలు...**

తేది 19 (బుధవారం) జేష్ఠ శుద్ధ తృయోదశి రోజు ఉదయం 9 గంటల నుండి సంకల్పసిద్ది కాలభైరవ పాశుపత హెూమాలు అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాదం కార్యక్రమం,
తేది 20(గురువారం) జ్యేష్ఠ శుద్ధ చతుర్దశి రోజు శ్రీశ్రీశ్రీ కోటిలింగేశ్వరస్వామివారికి ఉదయం 10 గంటలకు పుష్పాబిషేకం మరియు బిల్వాబిషేకం మధ్యాహ్నం అన్నప్రసాదం కార్యక్రమం జరుగును.
తేది 21(శుక్రవారం) ఉదయం 10 గంటలకు శ్రీశ్రీశ్రీజ్ఞానాంబికదేవి అమ్మవారికి పుష్పాబిషేకం పూజా కార్యక్రమాలు.
తేది 22(శనివారం) రోజు ఉదయం 11 గంటల నుండి అంగరంగ వైభవంగా ఆదిదంపతులైన శివపార్వతుల కళ్యాణం అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాదం వుంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.





అలంకరణతో కొలువుదీరిన శ్రీ వేణుగోపాల స్వామి, ఆలయ వార్షికోత్సవ పూజల్లో గ్రామ ఆలయ కమిటీ ప్రతినిధులు

## ఘనంగా రామకృష్ణాపురం గ్రామ శ్రీశ్రీశ్రీ వేణుగోపాల స్వామి

# ధ్వజస్తంభ ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవ పూజలు

**కొత్తకోట, జూన్ 18(నమస్తే ఉదయం):**
కొత్తకోట మండలంలో రామకృష్ణాపురం గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి దజస్తంభం, గ్రామదేవతల విగ్రహ ,బొడ్రాళ్ళ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను పూజా కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మంగళవారం ఈ ప్రతిష్టాపన మహెూత్సవ కార్యక్రమం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పలు భక్తి కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో గ్రామ పెద్దలు మాజీ సి డి సి చైర్మన్ మూల మల్ల చంద్రశేఖర్ రెడ్డి , మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి, మున్నూరు శేఖర్ , శివరాములు, భారతయ్య ,నాగరాజు, నరసింహ, వెంకటన్న, గ్రామ ప్రజలు ,భక్తులు పాల్గొని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంట్లో పూజా కార్యక్రమాలు ప్రజలందరూ గొప్పగా నిర్వహించి శ్రీ వేణుగోపాల స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మహా మంగళహారతి తీర్థ ప్రసాదాలు, అయ్యగార్ల ఆశీర్వాదం స్వీకరించారు.



ఆలయ ఆవరణలో నాగదేవతకు పూజలు చేస్తున్న భక్తులు



బొడ్రాయికి పూజలు చేస్తున్న రాలే కమిటీ ప్రతినిధులు



ధ్వజస్తంభానికి పూజ చేస్తున్న భక్తులు




## ప్రభుత్వం మహిళల కోసం ఎన్ని చట్టాలు తెచ్చిన

# రక్షణ లేకుండా పోతుంది...

**చట్టాలపై భయం ఉంటేనే వేధింపులకు కళ్లెం వేయగలం....**

**బాధిత కుటుంబానికి న్యాయం జరగాలి:ఫాస్ట్ ట్రాక్ చట్టాన్ని అమలు చేయాలని ప్రజాసంఘాల డిమాండ్.**

**కూకట్‌పల్లి, జూన్ 18 (నమస్తే ఉదయం):**
మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా వారికి మాత్రం రక్షణ లేకుండాపోతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఫాస్ట్ ట్రాక్ చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి చైతన్య రెడ్డి, ఐద్వా మండల కార్యదర్శి వి. కరుణ డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాలో 6 సంవత్సరాల బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో క్యాండిల్ రాలే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో రైస్ మిల్లు డ్రైవర్ బలరాం తల్లితో పాటు నిద్రిస్తున్న ఆరేళ్ల పాలికను ఎత్తుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడి హతమార్చాడు. ఆ మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం మహిళలపై, బాలికలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని, చట్టాలపై భయం ఉంటేనే వేధింపులకు కళ్లెం వేయగలమని అశ్లీలసైట్లు, వీడియోలతో యువత చెడు అలవాట్లకు పాల్పడుతున్నారని వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఫాస్ట్ ట్రాక్ చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తిక్, ఐద్వా మండల అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, సుగుణ, సీఐటీయూ నాయకులు పి.శంకర్, సతీష్, అనిత, మౌనిక, కవిత, దీప్తి, రాజు, మల్లేష్, మాధవి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పర్‌పల్లి రజక కులస్తుల స్మశాన వాటిక స్థలం కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్**

**రజక కులస్తులకు స్మశాన వాటికకు మౌలిక సదుపాయాలు కల్పించాలి**



ఉప్పరపల్లి రజక స్మశాన వాటిక స్థలం కబ్జాపై తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**రాజేంద్రనగర్,జూన్18 (నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్ పల్లి సర్వే నెంబర్ 144 లోని భూమిని కబ్జా చేస్తున్న కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ రాజేంద్రనగర్ తహసిల్దార్ రాములుకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు జి.బాబురావు ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను కలిసి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న కబ్జాలను నిలిపివేసి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ మాట్లాడుతూ...ఉప్పర్ పల్లి సర్వే నెంబర్ 144 లోని 2.6 గుంటల భూమి బంగ్ల పాపయ్య కుటుంబం పేరు పైన ఉంది.
అందులో 1.6 గుంటల భూమిని మాత్రమే అమ్మడం జరిగిందని ఆ భూమిలోనే 500 చగల భూమి ఉప్పర్ పల్లి చాకలి వాళ్లకు సంబంధించిన స్మశాన వాటికకు వదిలివేయడం జరిగిందన్నారు.
శ్మశానవాటికకు సంబంధిచిన భూమిని సిలుగురి బుచ్చిరెడ్డి కుమారులు శ్రీవర్ధన్ రెడ్డి,శ్రీధర్ రెడ్డిలు,సోలిటైర్ గ్లోబల్ స్కూల్ యాజమాన్యం యథేచ్ఛగా కబ్జా చేసారు.దింతో ఎవరైనా చనిపోతే శవాన్ని తీసుకెళ్లడనికి దారి కూడా లేకుండా పోయిందని వాపోయారు.పార్క్ స్థలం,నాలా స్థలాలకు సంబంధించి దాదాపు 3000 చ.గ.ల భూమి కబ్జా చేసి నటువంటి సోలిటైర్ గ్లోబల్ స్కూల్ యాజమాన్యం పైన చట్టరీత్య చర్యలు తీసుకోవాలని
డిమాండ్ చేసారు.వినపత్రం ఇచ్చిన వారిలో బిజెపి సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి,జోగి రవి, యాదగిరి తదితరులు ఉన్నారు.

# నీట్ పరీక్షలో జరిగిన తప్పిదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి

**తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్**

**నీట్ 2024 పరీక్ష రద్దు కోరుతూ విద్యార్థి సంఘాల స్టూడెంట్ మార్చ్...**

**నారాయణగూడ నుంచి లిబర్టీ అంబేద్కర్ విగ్రహం వరకు స్టూడెంట్ మార్చ్ చేపట్టిన విద్యార్థి సంఘాలు..**

**కూకట్‌పల్లి, జూన్ 18 (నమస్తే ఉదయం):**
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నీట్ పరీక్ష లో అవకతవకలు జరిగాయని మంగళవారం పలు విద్యార్థి సంఘాలు నారాయణగూడ నుండి లిబర్టీ అంబేద్కర్ విగ్రహం వరకు స్టూడెంట్ మార్చ్ నిర్వహించారు. నీట్ పరీక్ష లో జరిగిన తప్పిదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి మోడీ క్షమాపణ చెప్పాలనీ డిమాండ్ చేశారు. సుమారు 5 వేల మంది విద్యార్థులతో స్టూడెంట్ మార్చ్ పై నేటివరకు రోరు విప్పడం లేదని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోక తప్పదని విద్యార్థులు ఆగ్రహించారు.
ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ మాట్లాడుతూ గ్రేస్ మార్కులు వచ్చిన వారికి తిరిగి పరీక్ష నిర్వహిస్తామని కేంద్ర, సుప్రీంకోర్టు కు తెలిపింది, ఇది సరైంది కాదని గతంలో జరిగిన పరీక్షను రద్దు చేసి తిరిగి మరోసారి పరీక్ష నిర్వహించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ మంత్రివర్గ ప్రమాణ స్వీకార హడావిడిలో నీట్ ఫలితాలు విడుదల చేసిందని, 24 లక్షల మందికి పైగా వారి భవిష్యత్తు అంధకారంలో పడిందని అన్నారు.
దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, తెలంగాణ లోని కేంద్ర మంత్రులు దీనికి సమాధానం చెప్పాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగి రాకపోతే డిల్లీ లో ఆందోళన చేస్తామని, అన్ని విద్యార్థి సంఘాల ఐక్యవేదిక గా ఏర్పడి ఈ ఉద్యమం కొనసాగిస్తామని అన్నారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ మా ఆందోళన కొనసాగుతదని, మరోసారి విద్యార్థి సంఘాల నాయకులు అందరం కూర్చుని భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ నాయకత్వం, ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ, పి డి ఎస్ యు నాయకులు విజయ్, ఆజాద్, పరశురాం, నాగేశ్వరరావు, మహేష్, వి జె ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్, పి వై సి నాయకులు రాజీవ్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకట్, రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు వాలి ఉల్లా ఖాద్రి, పి వై ఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్, వై జె ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సలీం పాషా తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లుఅర్పిస్తున్న ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్

# యాదాద్రిలో గిరి ప్రదక్షిణం

(మొదటి పేజీ తరువాయి)

గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు ఆలయ ఆఫీసర్లు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఉదయం 5:45 గంటలకు వైకుంఠ ద్వారం వద్ద ఆలయ ఈవో భాస్కర్ రావుతో కలిసి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు చేసి సామూహిక గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులతో కలిసి కొండ చుట్టూ దాదాపుగా రెండున్నర కిలోమీటర్లు గిరిప్రదక్షిణ చేసి తిరిగి వైకుంఠ ద్వారం వద్ద ముగించారు. అనంతరం స్వామివారి పాదాల చెంత కొబ్బరికాయలు కొట్టి.. కొండపైకి వెళ్లి నారసింహుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.
ఈ సామూహిక గిరిప్రదక్షిణలోఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, అన్ని విభాగాల ఆలయ ఆఫీసర్లు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానిక భక్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కూడా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కాగా సామూహిక గిరిప్రదక్షిణ కోసం.. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేసి లైటింగ్ సదుపాయం కల్పించారు. గిరిప్రదక్షిణ మార్గానికి మరమ్మత్తులు చేసి భక్తులు ఈజీగా నడిచే విధంగా గిరిప్రదక్షిణ మార్గాన్ని రెడీ చేశారు.

# ఐటిఐలలో ఇక ఆధునిక శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ఐటీఐలను ఏటీసీలుగా మార్చే ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.2,324.21 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.307.96 కోట్లు (13.26 శాతం) కాగా టీటీఎల్ వాటా రూ.2016.25 కోట్లు (86.74). ఏటీసీలు కేవలం వివిధ కోర్సుల్లో శిక్షణకే పరిమితం కాకుండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా పని చేస్తాయి. అలాగే ఈ ఏటీసీలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలకు సాంకేతిక కేంద్రాలుగానూ (టెక్నాలజీ హబ్) పని చేస్తాయి. ఏటీసీల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి టీటీఎల్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. ఏటీసీలు భవిష్యత్తులో తమ సేవలను పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు అందజేస్తాయని అధికారులు తెలిపారు.



## మణికొండ మున్సిపాలిటీ తైబజార్ వేలం పాటలో..
# రూ.31.05 లక్షల ఆదాయం


**మణికొండ,జూన్18(నమస్తే ఉదయం):** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో 2024-25 సం సంబందించిన తైబజార్ వేలం పాట నిర్వహించారు.

కమిషనర్ ప్రదీప్ కుమార్ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు తైబజార్ వేలం పాటలు ప్రారంభించారు.

ఈ పోటీలో 16 మంది పోటాపోటీగా పోటీపడ్డారు.ఈ వేలం పాటలో చివరికి మహమ్మద్ దస్తగిరి 31 లక్షలా 5 వేల రూపాయలకు పాడి దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రమేష్,ఇతర అధికారులు రమణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**బండ్లగూడ, జూన్18(నమస్తే ఉదయం):** కిస్మత్ పూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ ఇంచార్జ్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్



పరిధిలోని ప్రాంతాలైన సాయిబాబా కాలనీ, ట్రంప్ విల్లాస్, రాంకీ, డిఫెన్స్ కాలనీ, ఆర్వీ నిర్మాణ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్, దర్గా, నమః విల్లాస్, ఇండోర్ విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అనంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

# మదనపల్లి నల్ల చెరువులో మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి : రవి నాయక్

**శంషాబాద్, జూన్ 18( నమస్తే ఉదయం):** శంషాబాద్ మండలం మదనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నల్ల చెరువులో నుండి మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక బిజెపి నాయకులు రవి నాయక్ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మదనపల్లి



గ్రామపంచాయతీ పరిధిలో హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారి పక్కన ఉన్న నల్ల చెరువులో నుండి అక్రమార్కులు రాత్రిపూట దొంగచాటుగా మట్టిని తరలిస్తున్నారని వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వారు ఫిర్యాదు చేశారు. మట్టి దొంగలను పట్టుకొని పక్షంలో హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. తాసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన వారిలో శంషాబాద్ మండల బిజెపి గిరిజన మోర్చా అధ్యక్షుడు రవి నాయక్. వెంకటేష్. నరసింహ ముదిరాజ్.. శంకరయ్య. మహేందర్.లాలూ సింగ్. బాలు నాయక్.తదితరులు ఉన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
# అందజేయాలి

- చిలుక మర్రి మహేందర్ ముదిరాజ్

**శంషాబాద్,జూన్ 18( నమస్తే ఉదయం):** శంషాబాద్ ఎంపీడీఓని కలిసి ప్రజా పాలనలో తీసుకున్నటువంటి అప్లికేషన్స్ అర్హులందరికీ గృహజ్యోతి పథకం అమలు అయ్యేవిదంగా చూడాలని కోరారు. అనేక గ్రామాలలో కొంత



మందికే జీరో బిల్ కరెంట్ అమలు అయ్యిందని ఇంకా ఉన్నటువంటి మిగిలిన అర్హులం దరికీ అమలు చెయ్యాలని ఎంపీడీఓ ని కలిసి ప్రతిగ్రామ పంచాయితీలో ఇదే పరిస్థితి ఉందని వివరించారు. ప్రతి గ్రామ పంచాయతీలో కౌంటర్లు పెట్టి అర్హులందిరికి గృహ జ్యోతి పథకం అందే విధంగా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యులు రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెండెట్ జిల్లా ఆనంద్, గుగ్గిళ్ల శ్రీను, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.







## వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి వివిధ పంటలలో
# 8 నూతన వంగడాలు విడుదల..

**రాజేంద్రనగర్,జూన్ 18(నమస్తే ఉదయం):** సెంట్రల్ వెరైటల్ రిలీజ్ కమిటీ,రాష్ట్రస్థాయి వెరైటల్ రిలీజ్ కమిటీల ఆమోదంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ పంటలలో నూతన వంగడాలను విడుదల చేసింది.వరి,మొక్కజొన్న,రాగి,సజ్జ,జొన్న పంటలలో మొత్తం ఎనిమిది రకాలను విడుదల చేసినట్లు ఉపకులపతి ఎం.రఘునందన్ రావు,పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి వెల్లడించారు. వరిలో రాష్ట్రస్థాయి వెరైటల్ రిలీజ్ కమిటీ ఆమోదంతో రెండు రకాలు,సెంట్రల్ వెరైటల్ రిలీజింగ్ కమిటీ ఆమోదంతో మరో రెండు రకాలను విడుదల చేశారు.

అలాగే రాష్ట్రస్థాయి వెరైటల్ రిలీజ్ కమిటీ ఆమోదంతో జొన్న,రాగి సజ్జ పంటలో ఒక్కొక్కటి చొప్పున అలాగే సెంట్రల్ వెరైటల్ కమిటీ ఆమోదంతో మొక్కజొన్నలో ఒక రకాన్ని విడుదల చేసినట్లు వివరించారు.

### వరిలో విడుదలైన రకాల వివరాలు..

రాష్ట్రంలో గత కొన్ని ఏళ్లుగా వరివిస్తీర్ణం గణనీయంగా పెరుగుతూ ఉండడంతో నీటిపారుదల సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో ఒకే ఏడాది రెండు పంటలు వేసుకోవడానికి అవకాశం ఉంది.ఇందుకోసం తక్కువ కాల వ్యవధితోపాటు అగ్గి తెగులు,సుడిదోమ, ఉల్లికోడులను తట్టుకొనే రకాల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని వరిలో కొత్తగా నాలుగు రకాలను రైతులకు వర్సిటీ అందుబాటులోకి తెచ్చింది. రాజేంద్రనగర్ వరి పేరిట ఆర్ఎన్ఆర్ -28361 అను దొడ్డు గింజల రకాన్ని రాష్ట్రస్థాయి వెరైటల్ కమిటీ ఆమోదంతో విడుదల చేసినట్లు ఎం.రఘునందన్ రావు,డాక్టర్ రఘురామి రెడ్డి తెలిపారు.అలాగే తెలంగాణ వరి- (కేఎన్ఎం -7037) పేరిట తక్కువ పంట కాలం కలిగిన,సన్నని,పొడవైన గింజ,తక్కువ నూక శాతం (దిగుబడి 62.3 కిలోలు),నాణ్యత కలిగిన అన్నం లక్షణాలు కలిగిన ఈ రకాన్ని జాతీయస్థాయిలో విడుదల చేసినట్లు వివరించారు.

సుడిదోమ,అగ్గి తెగులు, ఎండుకోళ్ళు తెగులును తట్టుకొనే తెలంగాణ వరి-1289 (డబ్ల్యూజి ఎల్ -1289)ను కూడా జాతీయస్థాయిలో వర్సిటీ విడుదల చేసింది.ఇది తెలంగాణతో పాటు చత్తీస్ ఘడ్,మహారాష్ట్ర,గుజరాత్ రాష్ట్రాలలోనూ సాగు చేయడానికి అనుకూలమైన రకమని డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. అలాగే ఉల్లికోడు బయోటైప్ లను తట్టుకొనే వరంగల్ వరి-119 ను కూడా రాష్ట్ర స్థాయిలో విడుదల చేయడం జరిగింది.

### మొక్కజొన్న..

కాండం కుళ్ళు తెగులు తట్టుకొని అధిక దిగుబడి నిచ్చే డిహెచ్ఎం-206 అనే నూతన మొక్కజొన్న హైబ్రిడ్ ను జాతీయస్థాయిలో విడుదల చేయడం జరిగింది.ఇది ఉత్తర భారత దేశంలోని వివిధ రాష్ట్రాలలో సాగుకు అనుకూలమైన మొక్కజొన్న హైబ్రిడ్.

### జొన్న..

యాసంగిలో సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపే మాల్దండి జొన్న రకానికి ధీటుగా,తాండూర్ పరిశోధన స్థానం నుంచి ఎస్ విటి-55 అను కొత్త జొన్న రకంను విడుదల చేశారు.జొన్న రొట్టె నాణ్యతతో ఉండడం దీని ప్రత్యేకత.

### సజ్జ & రాగి..

పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా అధిక ఇనుము,అధిక జింక్ కల్గిన పిబిహెచ్ 1625,సజ్జ హైబ్రిడ్ ను అలాగే రాగిలో అధిక కాల్షియం కలిగిన పిఆర్ఎస్-38 రకాన్ని రాష్ట్రస్థాయిలో విడుదల చేయడం జరిగింది.

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడిన తర్వాత గత 8 ఏళ్లలో వివిధ పంట లలో 61 నూతన వంగడాలను రైతులకు అందుబాటులోకి తేవడం జరిగింది. అందులో భాగంగా వరిలో- 25, మొక్కజొన్న- 2, జొన్న- 5, అపరాలు- 11,నూనె గింజలు- 7,పత్తి-1,పశుగ్రాస పంటలలో 10 రకాలను విడుదల చేయడం జరిగింది. అందులో రాష్ట్ర స్థాయిలో 23,జాతీయ స్థాయిలో 38 రకాలను విడుదల చేసినట్లు ఉపకులపతి ఎం. రఘునందన్ రావు,పరిశోధన సంచాలకు డాక్టర్ రఘురామి రెడ్డిలు వివరించారు.





వరిలో రూపొందించిన కొత్తరకం రకం పంట క్షేత్రాలు

# తీన్మార్ మల్లన్నకు మంత్రి పదవి ఇవ్వాలి

**హైదరాబాద్, జూన్ 18(నమస్తే ఉదయం):** నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గం ఎమ్మెల్సీగా అత్యధిక మెజారిటీతో విజయం సాధించి ఇటీవల పదవి బాధ్యతలను స్వీకరించిన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేద ప్రజల పెన్నిధి, సీనియర్ జర్నలిస్ట్, తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ ను తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షులు, న్యాయవాది మణికొండ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహాసభ ప్రతినిధులకు మాట్లాడుతూ... తీన్మార్ మల్లన్న పీడిత ప్రజల , అన్యాయానికి గురైన బాధితుల కోసం పోరాటం చేసి ప్రజాభిమానాన్ని చూడగొనడం ఎంతో అభినందనీయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తీన్మార్ మల్లన్నకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా టికెట్ ఇవ్వడం పట్ల మహాసభ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు. తీన్మార్ మల్లన్నకు మంత్రి పదవి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమములో మహాసభ ఉపాధ్యక్షులు, న్యాయవాది కొండూరు వినోద్ కుమార్, జితేందర్, కార్యదర్శి కొంతం సురేష్ బాబు, కార్యవర్గ సభ్యులు గడేకర్ల



ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్న ను సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు


సత్యనారాయణ, కాటం సునీల్, పలుగుల శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కట్టెల సుభాష్, మహాసభ మీడియా కమిటీ కన్వీనర్, కంచుకట్ల ప్రకాష్, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యులు గంటా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రైవేటు బస్సు..

## తృటిలో పెను ప్రమాదం ..
## ప్రయాణికులకు స్వల్ప గాయలు..

**రాజేంద్రనగర్,జూన్ 18(నమస్తే ఉదయం):** నిద్రమత్తులో వేగంగా దూసుకెళ్లిన ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లి సీసీ స్థంబాన్ని ఢీకొట్టింది. తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున బెంగళూరు జాతీయ రహదారి ఆరాంఘర్ చౌరస్తాలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కర్నూలు వైపు నుంచి ఓ ప్రైవేటు బస్సు తెల్లవారుజామున అతివేగంగా దూసుకొచ్చి ఆరాంఘర్ చౌరస్తాలో అదుపుతప్పింది.దీంతో డివైడర్ పైనున్న సీసీ కెమెరా స్తంభాన్ని వేగంగా ఢీకొట్టి ఆగిపోయింది.

ఈ ఘటనతో బస్సులో ఉన్న వారంతా ఒక్క సారిగా నిద్రలోంచి మేల్కొని భయాందోళనకు గురయ్యారు. బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయలతో




బయటపడ్డారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిద్ర మత్తు కారణంగానే ప్రమాదం జరిగినట్లు ట్రాఫిక్ పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.అయితే ప్రమాదం జరిగిన సమయంలో రోడ్డుపై జనం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను దశలవారిగా పూర్తి చేస్తాం

### కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

### డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తాం

**కూకట్‌పల్లి, జూన్ 18 (నమస్తే ఉదయం):**
ఫతేనగర్ డివిజన్ పరిధిలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను దశరవాదిగా పూర్తి చేయించి, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. కూకట్ పల్లి సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని న్యూ గౌతమ్ నగర్ లో స్థానిక నివాసితులు గత కొద్దిరోజులుగా డ్రైనేజీ సమస్య ఉందని మంగళవారం కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కార్పొరేటర్ సతిష్ గౌడ్ జలమండలి మేనేజర్ అనిల్ కుమార్ తో కలిసి గౌతమ్ నగర్ లో పర్యటించారు. పర్యటనలో భాగంగా బస్తీలో డ్రైనేజీ నీరు వెళ్లేందుకు పైపులైన్ సరిగా లేకపోవడం వల్ల డ్రైనేజీ లైన్ చౌక్ అయితుందని గమనించి జలమండలి మేనేజర్ అనిల్ కు వెంటనే టర్నింగ్ లో యు పైప్ లైన్ వేసి సమస్యని పరిష్కరించాలని జలమండలి మేనేజర్ అనిల్ కుమార్ ను ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తారని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా బస్తీలలో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే సమస్య పరిష్కరిస్తానని సతీష్ గౌడ్ బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు అంజయ్య, సురేష్ గౌడ్, గోపాల్, సురేందర్ నాయుడు, వీరేశం గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ఝాన్సీ లక్ష్మీబాయి స్ఫూర్తితో రాజకీయాల్లో రాణించాలి

### కూకట్‌పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్.

### ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి 166వ వర్ధంతి వేడుకలు....

**కూకట్‌పల్లి, జూన్ 18 (నమస్తే ఉదయం):**
కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని ఝాన్సీ లక్ష్మీబాయి 166వ వర్ధంతి పురస్కరించుకుని కూకట్ పల్లి హౌసింగ్ ఫిఫ్త్ ఫేజ్ లో జనసేన పార్టీ కార్యాలయంలో కూకట్ పల్లి నియోజక వర్గ జనసేన కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మా రెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ఝాన్సీ లక్ష్మీబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి





ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ ఝాన్సీలక్ష్మీ బాయి స్ఫూర్తితో మహిళలు రాజకీయాల్లోకి రాణించాని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు నిచ్చారని అన్నారు. చదువుకున్న వారు పాలనా పరమైన విధానపరమైన అంశాలపై అవగాహన కలిగిన మహిళలు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ సిఎం జనసేనాని సాధారణ కుటుంబాల నుండి వచ్చారని, ఆయన స్ఫూర్తితో మహిళలు వస్తారని పేర్కొన్నారు. రాజకీయాల్లో మహిళా నాయకులు బాధ్యత కలిగి ఉండాలని తాము కోరుకుంటు న్నట్లు చెప్పారు. తల్లి లాంటి మహిళలే జనసేన పార్టీకి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమం కోసం కృషి చేస్తా

### - ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్, జూన్ 18(నమస్తే ఉదయం):** రైతు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు. మంగళవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ మల్కారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ బుర్కుంట సతీష్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ శాసనసభ్యులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కలిసి సొసైటీ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.మల్కారం సొసైటీ బ్యాంకు కి మరో



ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు పత్రం అందజేస్తున్న సహకార శాఖ డైరెక్టర్ బూర్కుంట సతీష్

రెండు 1500 మెట్రిక్ టన్నుల గోదాముల విషయంలో ప్రకాష్ గౌడ్ చొరవతొనే ఈ గోదాము లు మల్కారం సొసైటీ కి మంజూరు అయ్యాయని సతీష్ తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను శాలువా తొ సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... రైతులకు ఎప్పుడు తన వంతు కృషి చేస్తానన్నారు. నాబార్డ్ బ్యాంకు ద్వారా ఒక్కో గోదాం కి 1,12,89,600 రెండు గోదాముల కి కలిపి 2,25,79,200 రూపాయలు నిధులు మంజూరయ్యాయి అన్నారు. ఈ గోడములు అతి తొందరగా శంకుస్థాపన చేసి వేగంగా పనులు చేసి రైతులకి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమం లో సొసైటీ బ్యాంకు వైస్ చైర్మన్ ప్రభుసాగర్, బాలరాజు గౌడ్, ఇతర డైరెక్టర్స్ పాల్గొన్నారు.



ఆస్పత్రి వివరాలను అడిగి తెలుసుకుంటున్న గద్వాల జిల్లా కలెక్టర్ బీఎస్ సంతోష్



ఆస్పత్రిలో రికార్డును తనిఖీ చేస్తున్న కలెక్టర్ సంతోష్




ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పనితీరును తనిఖీ చేస్తున్న కలెక్టర్ సంతోష్

## ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 14 మంది వైద్య సిబ్బందికి

# షోకాజ్ నోటీసులు...

### విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఫార్మసిస్ట్ పై సస్పెన్షన్ వేటు

### కంటి సమస్యలతో వచ్చే పేషెంట్లకు మెరుగైన సేవలు అందించాలి : జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 18(నమస్తే ఉదయం):**
ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పని చేసే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ వైద్య సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ప్రతి వార్డును సునిశితంగా పరిశీలించి అక్కడి పరిస్థితులు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలను క్షణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ లు ఎంత మంది నిర్దేశిత సమయానికి వచ్చారని రిజిస్టర్ లో పరిశీలించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు 14 మందితో పాటు మరో నలుగురు వైద్య సిబ్బంది గైర్హాజరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తపరిచారు. ప్రతిరోజు వారి హాజరు వివరాలను తెలిపే బయోమెట్రిక్ యంత్రంలో గల వారి వివరాలను ప్రింటు తీసి ఇవ్వాల్సిందిగా ఇంచార్జ్ సూపరింటెండెంట్ కు కలెక్టర్ ఆదేశించారు. విధులను సరిగా నిర్వహించని 14 మందికి షోకాస్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే ఫార్మసి స్టోర్ తనిఖీ చేసి స్టాక్ వివరాలు, రిజిస్టర్లు సరిగా నిర్వహించకపోవడం పట్ల ఫార్మసిస్టును వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. కంటి వైద్య చికిత్సకు సంబంధించిన ల్యాబ్ ను పరిశీలించి, కంటి సమస్యలతో వచ్చే పేషెంట్లకు వెంటనే మెరుగైన చికిత్సలు అందించే విధంగా ఆపరేషన్ థియేటర్ ను జులై, 1 నుండి పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. 50 పడకల వార్డు లో పేషెంట్లను (పురుషులను) అందులోకి షిఫ్ట్ చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్స్ నమోదు వివరాలు తెలిపే రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యాధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ డా. నవీన్ క్రాంతి, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బక్రీద్

### ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ఫసియోద్దీన్

**శంషాబాద్, జూన్ 18( నమస్తే ఉదయం):**
శంషాబాద్ మండలం మున్సిపాలిటీలో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

త్యాగానికి మారుపేరుగా జరుపుకునే బక్రీద్ సందర్భంగా ఒకరికొకరు ఆలింగం చేసుకొని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

శంషాబాద్. అహ్మద్ నగర్ కాజీ గల్లి.సిద్ధాంతి. అమిదుల్లా నగర్. నర్కుడ. కోత్వాల్ గూడ. ఝాన్సీ మియాగూడ. పెద్ద షాపూర్. పాలమాకుల. జూకల్. రామాంజపురం. చిన్న గోల్కొండ. తొండుపల్లి. బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఫసియుద్దీన్ అహ్మద్ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాఫీజ్ మహమ్మద్ ఫహీంఖాన్. వికారి హుస్సేన్ ఖాదిరి ముల్తానీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరిస్తా..

### - పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి

**కూకట్‌పల్లి, జూన్ 18 (నమస్తే ఉదయం):**
కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలో నెలకొనే ప్రతి సమస్యను గుర్తించి తక్షణమే పరిష్కరిస్తానని వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి అన్నారు. బస్తీలోని సి బ్లాక్ రోడ్ నెంబర్ 3, 20 లలో పాడైన నీటి పవర్ బోర్లను గుర్తించి జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం అధికారుల ఆదేశాలతో జలమండలి సిబ్బంది చంద్రారెడ్డి తో కలిసి పాపిరెడ్డి నగర్ బస్తీలో పర్యటించి పాడైన బోర్ల వివరాలను తెలుసుకున్నారు. బోర్లకు త్వరలోనే మరమ్మత్తులు చేయించి నీటి ఎద్దడి కలగాకుండా చూస్తానని చంద్రారెడ్డి హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆర్ భగవంతు రెడ్డి, నాయకులు ఎం ఈశ్వర్ రెడ్డి,సాంబశివుడు, రవీందర్ రెడ్డి, బిక్షపతి, సంధ్యారాణి, శ్రీనివాస్, శివకుమార్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.